
ప్రశ్నించడం కోసం...?
RNI NO. TELTEL/2023/90455
# మన ప్రజా ప్రతినిధి
ప్రజా ప్రతినిధి NEWS టీ.వి
తెలుగు దినపత్రిక
ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :276 శుక్రవారం జూలై 31 2026, పేజీలు - 4 వేల : 2/-
epaper.manaprajaprathinidhi.com
PUBLISHED FROM: TELANGANA /ANDHRAPRADESH

## రిజిస్ట్రేషన్లు కావాలా నాయనా ముడుపులు చెల్లించాల్సిందే

# సుల్తానాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో




## రిజిస్ట్రేషన్లకు భారీ వసూళ్ల ఆరోపణలు.. డాక్యుమెంట్ రైటర్ల పెత్తనం...!

○సామాన్యులకు చుక్కలు చూపిస్తున్న పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్

○రిజిస్ట్రేషన్లకు భారీ వసూళ్ల ఆరోపణలు.. డాక్యుమెంట్ రైటర్ల పెత్తనం...!

○ప్రభుత్వ కార్యాలయమా లేక మధ్యవర్తుల అడ్డానా అనే విధంగా మారింది ..?

○ఆ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాల్సిన పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

○అవినీతి ఆరోపణలతో మరోసారి చర్చనీయాంశంగా మారింది..?

○రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సామాన్య ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని,

○డాక్యుమెంట్ రైటర్ల సిండికేట్ ప్రభావం పెరిగిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి..?

(తెలంగాణ స్టేట్ బ్యూరో ప్రత్యేక కథనం పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం)//మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక నిఘాలో భాగంగా రిజిస్ట్రేషన్‌కు 20,000 ఇరవై వేల రూపాల నుండి 50,000 యాభై వేల రూపాయల వరకు అదనంగా వసూళ్లు..?ప్రభుత్వ ఫీజులు చెల్లించిన తర్వాత కూడా ఒక్కో రిజిస్ట్రేషన్‌కు 50,000 యాభై వేల రూపాయల పై మాటే అదనంగా వసూళ్లు చేస్తు న్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ?వివాదాస్పద ఆస్తుల విషయంలో లక్షల్లో రూపాయల వరకు డిమాండ్లు చేస్తున్నారని ప్రచారం స్థానికంగా సాగుతోంది.!




▶డాక్యుమెంట్ రైటర్లదే అసలు పెత్తనమా..?సుల్తానాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కంటే డాక్యుమెంట్ రైటర్లే రిజిస్ట్రేషన్ వ్యవహారాలను ప్రభావితం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.?రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జరిగే అనేక వ్యవహారాల్లో ప్రైవేట్ వ్యక్తుల జోక్యం పెరిగిందనే ఆరోపణలు ఉన్నాయి.! ▶ఫిర్యాదులు ఉన్న చర్యలు ఎందుకు లేవు...?ఈ వ్యవహారంపై గతంలో ఆధారాలు పంపాలని కోరిన జిల్లా రిజిస్ట్రేషన్ అధికారుల నుంచి ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు కనిపించలేదని పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. !దీంతో ఫిర్యాదులపై విచారణ జరుగుతోందా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.?రియల్ ఎస్టేట్ లావాదేవీలపై అనుమానాలు... అక్రమాలకు అండా..?కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులకు నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. అసైన్డ్, ఇనాం, ప్రభుత్వ భూములకు సంబంధించిన లావాదేవీలపై కూడా సమగ్ర విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు.! ▶ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పేది ఎవరు..?ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఏసీబీ, విజిలెన్స్ దాడులు జరుగుతున్న నేపథ్యంలో సుల్తానాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వినిపిస్తున్న ఆరోపణలపై కూడా సమగ్ర విచారణ జరిపి, నిజానిజాలు వెలికితీయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.?సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ పై ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరు తున్నా జద్చర్ల ప్రజానికం వేచి చూడండి అతి త్వరలో మీ ముందుకు మరో సంచలనాత్మక కద నంతో మీ మా మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రికలో



మన
ప్రశ్నించడం కోసం...?
RNI NO. TELTEL/2023/90455
# ప్రజా ప్రతినిధి
ప్రజా ప్రతినిధి NEWS టీ.వి
తెలుగు దినపత్రిక
ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :276 శుక్రవారం జూలై 31 2026, పేజీలు - 4 వెల : 2/-
epaper.manaprajaprathinidhi.com
PUBLISHED FROM: TELANGANA /ANDHRAPRADESH

## అమర్‌నాథ్ యాత్రకు సీఆర్‌పీఎఫ్ భద్రత




- యాత్రికుల రక్షణకు నిరంతర అప్రమత్తత
- సంయుక్త భద్రతా బలగాల సమన్వయ చర్యలు
- సురక్షిత యాత్రకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- దేశసేవలో సీఆర్‌పీఎఫ్ నిబద్ధత

శ్రీనగర్, జూలై 30 (మనప్రజాప్రతినిధి): శ్రీ అమర్‌నాథ్ యాత్రను సురక్షితంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు కేంద్ర రిజర్వు పోలీసు దళం (సీఆర్‌పీఎఫ్) సంయుక్త భద్రతా బలగాలతో కలిసి నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహిస్తోంది. యాత్రికుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తూ యాత్ర మార్గమంతా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ప్రతి యాత్రికుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శనం చేసుకుని సురక్షితంగా తిరిగి చేరేలా అన్ని చర్యలు అమలు చేస్తున్నట్లు సీఆర్‌పీఎఫ్ వెల్లడించింది. అమర్‌నాథ్ యాత్ర మార్గంలోని ప్రతి కీలక ప్రాంతంలో భద్రతా సిబ్బంది ఇరవై నాలుగు గంటలూ 2

## ఉత్తర తెలంగాణను ముంచెత్తిన వానలు

- వాయుగుండం ప్రభావంతో ఎడతెరిపి లేని వర్షాలు
- రెండు జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు
- జంపన్న వాగులో భక్తుడు గల్లంతు
- లోతట్టు ప్రాంతాల్లో వరదల ముప్పు


2

## నైపుణ్య విద్యపై సీఎం దృష్టి



- పన్నెండో తరగతి తర్వాత నైపుణ్యాలపై దృష్టి
- ప్రభుత్వ విద్యను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దే లక్ష్యం
- ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ
- విద్యార్థులను ప్రపంచ స్థాయి అవకాశాలకు సిద్ధం చేయాలని పిలుపు

2

## వర్షాలపై అధికార యంత్రాంగం అప్రమత్తం

- భారీ వర్షాల నేపథ్యంలో మంత్రి పొంగులేటి సమీక్ష
- ఆరెంజ్ అలర్ట్ జిల్లాల్లో ప్రత్యేక నిఘా
- ప్రజలకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు
- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశం



2

## బోనాలకు గవర్నర్‌కు ఆహ్వానం

- కొండా సురేఖ మర్యాదపూర్వక భేటీ
- లష్కర్ బోనాల ఉత్సవాలకు ఆహ్వాన పత్రం
- లోక్ భవన్‌లో సమావేశం


2

## తమిళనాడుకు కొత్త పెట్టుబడులు

- నాలుగు సంస్థలతో అవగాహన ఒప్పందాలు
- వివిధ రంగాల్లో పెట్టుబడులకు మార్గం
- 2,920 మందికి ఉపాధి అవకాశాల అంచనా
- ముఖ్యమంత్రి సమక్షంలో ఒప్పందాల కుదుర్చడం

చెన్నై, జూలై 30 (మనప్రజాప్రతినిధి): తమిళనాడులో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలను మరింత విస్తరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ సమక్షంలో చెన్నైలోని తమిళనాడు పరిశ్రమల మార్గదర్శక సంస్థలో పరిశ్రమలు, పెట్టుబడుల ప్రోత్సాహం, వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు అంతర్జాతీయ సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదిరాయి. ఈ ఒప్పందాల ద్వారా రాష్ట్రంలో పలు రంగాల్లో కొత్త పెట్టుబడులు రానున్నాయి. తమిళనాడు పరిశ్రమల మార్గదర్శక సంస్థ స్విట్జర్లాండ్‌కు చెందిన చబ్ సంస్థ, జర్మనీకి చెందిన నార్డెక్స్ సంస్థ, పశ్చిమ ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయం, దక్షిణ కొరియాకు చెందిన మోటివ్‌లింక్ సంస్థలతో వివిధ రంగాలకు సంబంధించిన అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేసింది. ప్రపంచ స్థాయి పరిశ్రమలు, విద్యాసంస్థలతో భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడమే ఈ ఒప్పందాల ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం పేర్కొంది. ఈ పెట్టుబడులు ప్రపంచ సామర్థ్య కేంద్రాలు, పరిశోధనఅభివృద్ధి కేంద్రాలు, తయారీ రంగం, ఉన్నత విద్య తదితర కీలక రంగాలను కవర్ చేయనున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, ఆధునిక పరిశ్రమల విస్తరణకు ఈ ఒప్పందాలు 2

## శ్రీకాకుళం పర్యటనలో జగన్‌కు ఘన స్వాగతం

-విశాఖ నుంచి శ్రీకాకుళం వరకు భారీ జనసందోహం
-తగరపువలస, భోగాపురం, రణస్థలంలో కార్యకర్తల స్వాగతం
-పర్యటనకు ప్రజల నుంచి విశేష స్పందన అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ
-రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైన పర్యటన


3

## గాజీపూర్‌కు రూ.692 కోట్ల అభివృద్ధి పనులు

-268 ప్రజాప్రయోజన పనులకు ప్రారంభం
-పలు పథకాల లబ్ధిదారులకు ధ్రువపత్రాల పంపిణీ
-డబుల్ ఇంజిన్ ప్రభుత్వంపై యోగి ప్రశంసలు
-శ్రావణ మాసం తొలి రోజున అభివృద్ధి కానుకలు


3

# అమర్‌నాథ్ యాత్రకు సీఆర్‌పీఎఫ్ భద్రత




మెదటి పేజీ తరువాయి

అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారు. యాత్రికుల రాకపోకలను పర్యవేక్షించడంతో పాటు అనుమానాస్పద కదలికలపై నిరంతర నిఘా కొనసాగిస్తున్నారు. యాత్ర సాఫీగా సాగేందుకు సంయుక్త భద్రతా బలగాలు పరస్పర సమన్వయంతో పని చేస్తున్నాయి.పర్వత ప్రాంతాల్లో ప్రతికూల వాతావరణ పరిస్థితులు, భౌగోళిక సవాళ్లు ఉన్నప్పటికీ భద్రతా సిబ్బంది తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తున్నారు. అత్యవసర పరిస్థితులు తలెత్తితే వెంటనే స్పందించేలా ప్రత్యేక బృందాలు సిద్ధంగా ఉన్నాయి. యాత్రికులకు అవసరమైన సహాయం అందించేందుకు వివిధ ప్రాంతాల్లో భద్రతా సిబ్బందిని మోహరించారు. యాత్రకు వచ్చే భక్తులు ప్రశాంతంగా, భయాందోళనలు లేకుండా పవిత్ర గుహను దర్శించుకునేలా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. భద్రతతో పాటు రద్దీ నియంత్రణ, మార్గదర్శకత్వం, అత్యవసర సేవల సమన్వయంపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. యాత్ర మొత్తం సురక్షితంగా కొనసాగేందుకు నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోంది.దేశ భద్రతతో పాటు ప్రజల రక్షణలో సీఆర్‌పీఎఫ్ కీలక పాత్ర పోషిస్తోందని అధికారులు పేర్కొన్నారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ విధి నిర్వహణలో నిబద్ధత చూపుతూ యాత్రికుల భద్రతను కాపాడుతున్న భద్రతా సిబ్బంది సేవలను ప్రశంసించారు. దేశసేవే లక్ష్యంగా భద్రతా చర్యలను మరింత సమర్థంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. శ్రీ అమర్‌నాథ్ యాత్ర దేశవ్యాప్తంగా లక్షలాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా కొనసాగుతోంది. ఈ యాత్ర సురక్షితంగా, విజయవంతంగా పూర్తయ్యేలా సీఆర్‌పీఎఫ్‌తో పాటు ఇతర భద్రతా సంస్థలు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి మైలు ప్రయాణాన్ని భద్రంగా మార్చేందుకు కృషి చేస్తున్నాయి. యాత్రికుల భద్రతే తమ తొలి ప్రాధాన్యమని సీఆర్‌పీఎఫ్ స్పష్టం చేసింది.

# ఉత్తర తెలంగాణను ముంచెత్తిన వానలు



మెదటి పేజీ తరువాయి

హైదరాబాద్, జూలై 30 (మనప్రజాప్రతినిధి): బంగాళా ఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో గత 48 గంటలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. పలు లోతట్టు ప్రాంతాలు జలమయమవగా, రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గ్రామాల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. నిర్మల్, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. వాగులు ప్రమాదకర స్థాయిలో ప్రవహించడంతో పలు గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. రహదారులపై వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పలుచోట్ల వంతెనలపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో అధికారులు ప్రయాణాలు చేయవద్దని హెచ్చరికలు జారీ చేశారు.వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత ఆయా జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, విద్యాసంస్థలకు గురువారం సెలవు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. అవసరమైతే తదుపరి పరిస్థితులను సమీక్షించి మరిన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ములుగు జిల్లాలోనూ భారీ వర్షాలు కొనసాగుతున్నాయి. కన్నాయిగూడెం ప్రాంతంలో అత్యధిక వర్షపాతం నమోదుకావడంతో వరద పరిస్థితులు ఆందోళనకరంగా మారాయి. ముందస్తు చర్యల్లో భాగంగా అధికారులు వరద బాధితుల కోసం అత్యవసర పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రమాద ప్రాంతాల్లో నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టారు. సహాయక బృందాలు నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాయి.ఇదిలా ఉండగా, ప్రముఖ పుణ్యక్షేత్రమైన మేడారంలో జంపన్న వాగు ఉగ్రరూపం దాల్చింది. వాగులో స్నానం చేసేందుకు దిగిన ఘట్‌కేసర్‌కు చెందిన ఓ భక్తుడు నీటి ఉద్ధృతికి కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు, విపత్తు స్పందన బృందాలు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు ప్రారంభించాయి. అయితే వాగులో ఉద్ధృతి ఎక్కువగా ఉండటంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోంది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యవసర పరిస్థితులు మినహా బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు. నదులు, వాగులు, చెరువుల వద్దకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అధికారుల సూచనలు పాటిస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర యంత్రాంగం పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన సహాయక చర్యలను వేగవంతం చేస్తోంది.

# నైపుణ్య విద్యపై సీఎం దృష్టి



మెదటి పేజీ తరువాయి

హైదరాబాద్, జూలై 30 (మనప్రజాప్రతినిధి): మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా నర్సరీ నుంచి పన్నెండో తరగతి వరకు విద్య పూర్తిచేసిన అనంతరం విద్యార్థులను నైపుణ్యాధారిత విద్య, ఉపాధి అవకాశాల వైపు మళ్లించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. విద్యారంగంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఫిన్లాండ్, జర్మనీ దేశాల్లో విద్యా అధ్యయన పర్యటన పూర్తి చేసుకుని వచ్చిన ఉపాధ్యాయ ప్రతినిధులతో హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ దాశరథి ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పన్నెండో తరగతి పూర్తయ్యే సమయానికి ప్రతి విద్యార్థికి ప్రపంచ పరిస్థితులపై సమగ్ర అవగాహన ఉండేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ముఖ్యమంత్రి అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని, వారు విద్యార్థుల భవిష్యత్తుపై దృష్టి సారించాలని కోరారు. వచ్చే విద్యా సంవత్సరానికి చేపట్టాల్సిన సంస్కరణలపై డిసెంబర్‌లోగా సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని, ప్రతి మండలాన్ని ఒక విద్యా సమూహంగా ఏర్పాటు చేసి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.ప్రపంచ దేశాలు తెలంగాణ ప్రభుత్వ విద్యా వ్యవస్థను ఆదర్శంగా చూసే స్థాయికి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. విద్యతో పాటు క్రమశిక్షణ, నైపుణ్యాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయుల నుంచి సూచనలు స్వీకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఉపాధ్యాయ సంఘాలు తమ సమస్యలకంటే పిల్లల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. అమెరికాపైనే దృష్టి కేంద్రీకరించే ధోరణిని మార్చుకొని జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్, చైనా వంటి దేశాల్లో ఉన్న ఉపాధి అవకాశాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. భాషా పరిజ్ఞానంతో పాటు నైపుణ్యాలు ఉంటే విదేశాల్లో అధిక వేతనాలతో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. శ్వేతకాలర్ ఉద్యోగాలతో పాటు నైపుణ్యాధారిత ఉద్యోగాలపైనా విద్యార్థులను సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని వివరించారు.విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో దాదాపు తొమ్మిది శాతం నిధులు కేటాయించామని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో సుమారు 27.50 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్నారని, ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం సగటున రూ.1.08 లక్షలు ఖర్చు చేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో గత మూడేళ్లుగా విద్యార్థుల ప్రవేశాలు పెరుగుతున్నాయని, విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఫలిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతుల ప్రారంభం, నర్సరీ నుంచి పన్నెండో తరగతి వరకు అల్పాహార పథకం అమలు, 23 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు, 30 వేల మందికిపైగా బదిలీలు చేపట్టిన విషయాలను ముఖ్యమంత్రి ప్రస్తావించారు. విద్యా రంగంలో సమూల మార్పులు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని, భవిష్యత్ తరాలను స్వయం సమర్థులుగా తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని అన్నారు. సమావేశానికి ముందు ఫిన్లాండ్, జర్మనీ పర్యటనకు వెళ్లి వచ్చిన ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను ముఖ్యమంత్రి సందర్శించారు.

# వర్షాలపై అధికార యంత్రాంగం అప్రమత్తం




మెదటి పేజీ తరువాయి

హైదరాబాద్, జూలై 30 (మనప్రజాప్రతినిధి): ఛత్తీస్‌గఢ్ మీదుగా పయనిస్తున్న తీవ్ర వాయుగుండం, చురుగ్గా ఉన్న నైరుతి రుతుపవనాల ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జిల్లాల అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ, గృహనిర్మాణ, సమాచారపౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. జిల్లా స్థాయిలో రెవెన్యూ యంత్రాంగం ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని సూచించారు. గురువారం రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ అధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించి రాష్ట్రంలోని తాజా వర్ష పరిస్థితులను సమీక్షించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, రానున్న రెండు రోజుల్లో కురిసే వర్షాల తీవ్రతపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. భారీ వర్షాలు నమోదవుతున్న జిల్లాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, వాగులు, వంకలు, చెరువులు, జలాశయాల వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాల్లో నివసించే ప్రజలను ముందుగానే అప్రమత్తం చేసి అవసరమైతే వెంటనే సురక్షిత ప్రాంతాలకు లేదా పునరావాస కేంద్రాలకు తరలించాలని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్లు, పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, విద్యుత్, నీటిపారుదల, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడితే తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని, ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అవసరమైన యంత్రాలు, సహాయక బృందాలు, వైద్య సిబ్బందిని ముందుగానే సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ట్రాఫిక్, విద్యుత్, తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. హైడ్రా, జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నీరు నిలిచే ప్రాంతాల్లో వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల సాధారణ జీవనానికి ఆటంకం కలగకుండా నగర పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.రాష్ట్రంలో నాలుగు రోజుల క్రితం వరకు సుమారు 30 శాతం మేర ఉన్న వర్షపాతం లోటు, గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో దాదాపు సాధారణ స్థాయికి చేరుకుందని మంత్రి తెలిపారు. అయితే రానున్న రెండు రోజుల్లో మరింత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు జూలై 30, 31 తేదీల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. అలాగే నిజామాబాద్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించినట్లు వెల్లడించారు. ఈ జిల్లాల కలెక్టర్లు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అవసరమైన సహాయక చర్యలను యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు.

# బోనాలకు గవర్నర్‌కు ఆహ్వానం



మెదటి పేజీ తరువాయి

హైదరాబాద్, జూలై 30 (మనప్రజాప్రతినిధి): తెలంగాణలో నిర్వహించనున్న ఆషాఢ జాతర (లష్కర్ బోనాలు) ఉత్సవాలకు రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లాను ఆహ్వానించారు. ఈ మేరకు అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గురువారం హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు కూడా సమావేశంలో పాల్గొన్నారు. సికింద్రాబాద్‌లో జరగనున్న ఆషాఢ జాతర, లష్కర్ బోనాల ఉత్సవాల విశిష్టత, ఏర్పాట్ల గురించి గవర్నర్‌కు వివరించారు. ఉత్సవాలకు హాజరై భక్తులను ఆశీర్వదించాలని కోరారు.మంత్రి కొండా సురేఖ బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మహోత్సవమని తెలిపారు. ప్రతి ఏడాది లక్షలాది మంది భక్తులు పాల్గొనే ఈ ఉత్సవాలు రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. ఈసారి కూడా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు, భక్తులకు అవసరమైన సౌకర్యాలు, భద్రతా చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ హనుమంతరావు గవర్నర్‌కు వివరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు.గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఆహ్వానాన్ని స్వీకరించి బోనాల ఉత్సవాల నిర్వహణపై వివరాలను అడిగి తెలుసుకున్నట్లు రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. తెలంగాణ సంస్కృతిలో బోనాల పండుగకు ఉన్న విశిష్ట స్థానాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించినట్లు సమాచారం.

# తమిళనాడుకు కొత్త పెట్టుబడులు




మెదటి పేజీ తరువాయి

దోహదపడతాయని అధికారులు తెలిపారు. రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి ఇవి మరింత ఊతమిస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ పెట్టుబడుల ఫలితంగా తమిళనాడులో ప్రత్యక్ష, పరోక్షంగా కలిపి 2,920 మందికి పైగా ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ముఖ్యంగా యువతకు నైపుణ్యాధారిత ఉద్యోగాలు పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. ప్రపంచ స్థాయి సంస్థలు రాష్ట్రంలో కార్యకలాపాలు ప్రారంభించడం ద్వారా స్థానిక పరిశ్రమలకు కూడా ప్రయోజనం చేకూరనుంది.పెట్టుబడులను ఆకర్షించడంలో తమిళనాడు ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక విధానాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అధికారులు తెలిపారు. దేశీయ, విదేశీ సంస్థలకు అనుకూల వాతావరణాన్ని కల్పిస్తూ రాష్ట్రాన్ని పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు. పరిశ్రమల అభివృద్ధితో పాటు ఉపాధి సృష్టికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ సమక్షంలో జరిగిన ఈ అవగాహన ఒప్పందాలు రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి మరో మైలురాయిగా నిలుస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. పరిశోధన, తయారీ, ఉన్నత విద్య, ప్రపంచ సామర్థ్య కేంద్రాల విస్తరణతో తమిళనాడులో ఆర్థికాభివృద్ధి మరింత వేగం

# శ్రీకాకుళం పర్యటనలో జగన్‌కు ఘన స్వాగతం





శ్రీకాకుళం, జూలై 30 (మనప్రజాప్రతినిధి): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శ్రీకాకుళం పర్యటన సందర్భంగా ఆయనకు పార్టీ శ్రేణులు, అభిమానులు ఘన స్వాగతం పలికారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తెలిపింది. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వైపు సాగిన పర్యటనలో పలుచోట్ల పెద్ద ఎత్తున ప్రజలు, కార్యకర్తలు తరలివచ్చి స్వాగతం పలికారని పేర్కొంది. ఈ పర్యటన రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ విడుదల చేసిన వివరాల ప్రకారం తగరపువలస, భోగాపురం, రణస్థలం ప్రాంతాల్లో వైఎస్ జగన్‌కు స్వాగతం పలికేందుకు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు. రహదారుల వెంట ప్రజలు బారులు తీరగా, పలు ప్రాంతాల్లో నినాదాలతో నాయకుడికి స్వాగతం పలికారని పార్టీ వెల్లడించింది. పర్యటన మొత్తం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగిందని తెలిపింది.వైఎస్ జగన్ పర్యటనకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. రాష్ట్ర ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి తమ మద్దతు తెలియజేశారని పార్టీ నాయకులు వెల్లడించారు. ఈ స్పందన పార్టీపై ప్రజల్లో ఉన్న విశ్వాసానికి నిదర్శనమని వారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ విధానాలపై కూడా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించింది. ప్రజల సమస్యలపై ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని పేర్కొంది. జగన్ పర్యటనకు లభిస్తున్న స్పందనను చూసి కూటమి నాయకులు ఆందోళన చెందుతున్నారని పార్టీ వ్యాఖ్యానించింది. శ్రీకాకుళం పర్యటనలో వైఎస్ జగన్ పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై స్థానిక పరిస్థితులపై ఆరా తీసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రజా సమస్యలు, రైతులు, మహిళలు, యువత ఎదుర్కొంటున్న అంశాలపై చర్చించినట్లు వెల్లడించాయి. పార్టీ బలోపేతానికి అవసరమైన కార్యాచరణపై కూడా నాయకులతో చర్చలు జరిగినట్లు సమాచారం. వైఎస్ జగన్ శ్రీకాకుళం పర్యటనకు ప్రజలు, పార్టీ శ్రేణుల నుంచి లభించిన స్పందనతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొన్నట్లు పార్టీ తెలిపింది. రానున్న రోజుల్లో ప్రజా సమస్యలపై మరింత విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొంది. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం తమ పోరాటం కొనసాగుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది.

# గాజీపూర్‌కు రూ.692 కోట్ల అభివృద్ధి పనులు




గాజీపూర్, జూలై 30 (మనప్రజాప్రతినిధి): ఉత్తరప్రదేశ్‌లోని గాజీపూర్ జిల్లా అభివృద్ధికి మరో ముందడుగు పడింది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ గురువారం రూ.692 కోట్ల వ్యయంతో చేపట్టనున్న 268 ప్రజాప్రయోజన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. గాజీపూర్, జఖ్నియా, మొహమ్మదాబాద్, సైద్‌పూర్, జమానియా, జహూరాబాద్, జంగీపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఈ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ఆమోద పత్రాలు, ధ్రువపత్రాలను ముఖ్యమంత్రి అందజేశారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.గాజీపూర్ జిల్లా మహారాజ గాధి, గంగానది ఆశీర్వాదంతో పవిత్రమైన ప్రాంతమని యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నారు. చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యం కలిగిన ఈ జిల్లా అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోందని తెలిపారు. కొత్త అభివృద్ధి పనులతో జిల్లా పురోగతి మరింత వేగవంతం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్ర ప్రజలు పేదరికం, అభివృద్ధి లోపంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని యోగి విమర్శించారు. ప్రస్తుతం డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందుతున్నాయని చెప్పారు. ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు.రూ.692 కోట్లతో చేపడుతున్న ఈ ప్రాజెక్టుల ద్వారా రహదారులు, తాగునీరు, విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు తదితర రంగాల్లో అభివృద్ధి మరింత వేగం పుంజుకుంటుందని ప్రభుత్వం పేర్కొంది. ప్రాంతీయ అవసరాలకు అనుగుణంగా వివిధ ప్రజాప్రయోజన పనులు చేపట్టడం ద్వారా స్థానిక ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించింది. శ్రావణ మాసం తొలి రోజున గాజీపూర్ ప్రజలకు ఈ అభివృద్ధి కానుకలు అందడం ఆనందకరమని యోగి ఆదిత్యనాథ్ అన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా జిల్లా సమగ్ర అభివృద్ధి సాధించడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. జిల్లా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇదే ఉత్సాహంతో కొనసాగిస్తుందని పేర్కొన్నారు.

# 76.45 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మనప్రజాప్రతినిధి//మేడ్చల్: ఉప్పల్ నియోజకవర్గంలో రూ. 76 కోట్ల 45 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు,వాణిజ్యం మరియు శాసన వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు శ్రీ తోటకూర వజ్రేష్ యాదవ్ ,ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ మందముల పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ



మనప్రజాప్రతినిధి// మేడ్చల్: జవహర్ నగర్ రాంకి చెత్త డంపింగ్ యార్డును శాస్త్రీయ పద్ధతిలో మూసివేయాలని డిమాండ్ చేస్తూ జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాటకమిటి చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్ అధ్యక్షతన కో కన్వీనర్ల సమావేశం జరిగింది. 2026, జూలై-30, గురువారంరోజు, కీసర సర్కిల్, జవహర్ నగర్ జీహెచ్ఎంసీ, ప్రగతినగర్, నీలం రాంచంద్రయ్య భవనంలో జూలై-26 న డంపింగ్ యార్డు పై జరిగిన సదస్సు సమీక్ష సమావేశం జరిగింది.ఈపై సమావేశంలో కమిటీలో ఉన్న అన్ని పార్టీలు, ప్రజా సంఘాలకు చెందిన గౌరవ సలహాదారులు, మాజీ ఉపసర్పంచ్ రావల్ కోల్ నర్సింహ్మా గౌడ్, మాజీ కార్పొరేటర్స్ గొడుగు వేణు, టిఆర్ఎస్(జాగృతి) మేకల లలిత యాదవ్, కాంగ్రెస్ మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, బీఆర్ఎస్ కొండల్ ముదిరాజ్, రాజశేఖర్, టియుజేఏసి తుమ్మల ప్రపుల్ రాంరెడ్డి, టిజేఎస్ బద్రగామి అంజినేయులు, డ్వాక్రా మహిళిసంఘాల చైర్మన్ శోభ, సిపిఐ తోటపల్లి శంకర్, సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ అనురాధ, సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్ గద్దం సదానందం, సిఎంఎస్ జయ, పిఓడబ్ల్యూ(విముక్తి) పెర్క సునీత, బహుజనసత్త బండకింది సింగరయ్య గౌడ్, బి.ఎన్.ఆర్.కె.ఎస్. సూర వెంకటయ్య, విఆర్ఆర్ కాలనీ సురేందర్, కోశాధికారి, ఐ.ఎఫ్.టి.యు. పి.శివబాబు, టియుసిఐ వి.ప్రవీణ్, జర్నలిస్ట్ కొన్నెవేణు, ఎస్.బి.ఎన్.కెఎస్. కుమార్, టివిఐవి మబ్బుబాలు తదితర మెజారిటీ కో కన్వీనర్లు పాల్గొన్నవారిలో ఉన్నారు. 26-07-2026 న స్వర్ణాంధ్ర యాప్రాల్ డిఎన్ ఆర్ గార్డెన్ లో జరిగిన సదస్సుపై సమీక్షించ, అనంతరం భవిష్యత్ కార్యాచరణను ప్రకటించుకోవడం జరిగిందని షేక్ షావలి, ఉమామహేష్ పేర్కొన్నారు. డంపింగ్ యార్డు ఎత్తివేతకై ఎం.పి. ఈటెల రాజేందర్ కు సమస్యతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించడం, మేడ్చల్ కంటోన్మెంట్ ప్రాంతాలలో ఉన్న ఎమ్మెల్యేలను కలిసి డంపింగ్ యార్డు సమస్య తీవ్రతను తెలియ జేయాల్సిన అవసరాన్ని సమావేశం గుర్తించిందని అన్నారు. జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ 28 మంది మాజీ కార్పొరేటర్ల కలిసి, డంపింగ్ యార్డు మూసివేతకు జరుగుతున్న కార్యక్రమంలో విధిగా పాల్గొనేలా చేయాలనే సూచనలు సమావేశంలో వచ్చాయని గుర్తుచేశారు. అదేవిధంగా డంపింగ్ యార్డు పరిసర బాధిత ప్రాంతాల ప్రజాప్రతినిదులను, సంఘాలను, పార్టీలను కలుపుకొని, బలమైన డంపింగ్ యార్డు ప్రజావ్యతిరేక ఉద్యమ నిర్మాణంలో బాగస్వాములను చేయడానికి దమ్మాయిగూడ యాంటి డంపింగ్ యార్డు జేఏసితో కలిసి సంయుక్త కార్యచరణ చేపట్టాలనే సూచనలు కూడ వచ్చాయని తెలియజేశారు. తద్వారా డంపింగ్ యార్డు భాదిత గ్రామాలు, కాలనీలలో అఖిలపక్ష కమిటీలను ఏర్పాటు చేయాలని,డంపింగ్ యార్డు భాధితు లైన ప్రజలను పెద్ద ఎత్తున కలుపుకొని డంపింగ్ యార్డు ను శాశ్వతంగా ఎత్తివేసేంత ఎడతెగని పోరాటం చేయాల్సిన తదితర భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్ణయించుకోవడం జరిగిందని అన్నారు.

# దొంగతనాలకు చెక్ పెడదాం



మనప్రజాప్రతినిధి//సూర్యాపేట జిల్లా: సూర్యాపేట జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు హాజరైన కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ, ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డివ్యవసాయానికి ప్రాణాధారమైన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్వహణ, భద్రతతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్ల దొంగతనాల నివారణే ధ్యేయంగా సూర్యాపేట జిల్లా పోలీసు యంత్రాంగం ముందడుగు వేసింది. హుజూర్ నగర్, కోదాడ నియోజకవర్గాల పరిధిలోని రైతులు, ఇరిగేషన్, విద్యుత్, వ్యవసాయ అధికారులతో కలిసి హుజూర్ నగర్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.రైతు కమిటీలు వేసి పర్యవేక్షించాలి: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన లిఫ్ట్ ఇరిగేషన్లలో ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు, వైర్లు, ఆయిల్ దొంగతనానికి గురైతే చివరకు తీవ్రంగా నష్టపోయేది రైతాంగమేనని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆవేదన వ్యక్తం చేశారు. దొంగతనాలు జరిగాక పోలీసులు ఇతర రాష్ట్రాలకు వెళ్లి నిందితులను పట్టుకొని సొత్తు రికవరీ చేస్తున్నారని, అయితే దొంగతనాలు జరగకుండా ముందస్తుగా అడ్డుకోవడమే ముఖ్యమని స్పష్టం చేశారు.సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ప్రతి లిఫ్ట్ పరిధిలో రైతులు సహకార సొసైటీలు, కమిటీలుగా ఏర్పడి నిరంతరం పర్యవేక్షించుకోవాలని సూచించారు. రైతుల కమిటీల ఏర్పాటు అంశాన్ని ప్రభుత్వం, ఇరిగేషన్ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. లిఫ్టుల వద్ద తప్పనిసరిగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశమున్నందున, రైతులు నీటిని ఆదా చేస్తూ తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయడానికి ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు.రైతులకు పోలీసుల అండ.. పెట్రోలింగ్ ముమ్మరం: ఎస్పీ నరసింహ దేశానికి వెన్నుముక అయిన రైతన్నలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎస్పీ నరసింహ స్పష్టం చేశారు. నివాస ప్రాంతాలకు దూరంగా ఉన్న లిఫ్ట్ పథకాలనే లక్ష్యంగా చేసుకుని దొంగలు వైర్లు, ఆయిల్, ట్రాన్స్‌ఫార్మర్లు ఎత్తుకెళ్తున్నారని తెలిపారు. రైతుల మధ్య ఐకమత్యం, సామాజిక బాధ్యత పెరిగినప్పుడే దొంగతనాలకు చెక్ పెట్టవచ్చన్నారు. పోలీసు శాఖ తరఫున లిఫ్టుల వద్ద పాయింట్ బుక్స్ ఏర్పాటు చేసి, నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. దొంగతనాల నిర్మూలనలో రైతులు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు.ఫ్టలను సొంత ఆస్తిగా భావించాలి: ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డిప్రభుత్వం రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి కోసం ఏర్పాటు చేస్తున్న లిఫ్ట్ ఇరిగేషన్లను రైతులు తమ సొంత ఆస్తిగా భావించి రక్షించుకోవాలని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి కోరారు. లిఫ్టులలో దొంగతనాలు జరిగితే సాగునీరు అందక రైతులే నష్టపోతారని అన్నారు.వ్యవసాయ రంగానికి నిరంతర నీరందించేందుకు ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అనుక్షణం కృషి చేస్తున్నారని తెలిపారు. రైతుల ప్రయోజనాల కోసం, దొంగతనాల నివారణే ధ్యేయంగా ఇన్ని శాఖలను ఒకే వేదికపైకి తెచ్చి భారీ అవగాహన సదస్సు నిర్వహించిన జిల్లా పోలీసు యంత్రాంగాన్ని, ఎస్పీ నరసింహను ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి సూర్యనారాయణ, ఇరిగేషన్ సిఇ నాగభూషణం, విద్యుత్ డిఇ రామ్మోహన్ రెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్, తహసిల్దార్ కవిత ఇరిగేషన్, వ్యవసాయ శాఖల అధికారులు, హుజూర్ నగర్, కోదాడ నియోజకవర్గాల పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, రెండు నియోజకవర్గాల పరిధిలోని రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సదాశివపేట మండల్ సూరారం గ్రామం గ్రామపంచాయతీని అకస్మాత్తుగా తనిఖీలు చేసిన డి ఎల్ పి ఓ అనిత



సదాశివాపేట (మనప్రజాప్రతినిధి): సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం సూరారం గ్రామపంచాయతీ పరిధిలో.. మంగళవారం రోజు ..అధికారులకు విన్నవించగా డి ఎల్ పి ఓ అనిత గారు గ్రామంలో తనిఖీలు . నిర్వహించగా పంచాయతీ ఫైనాన్స్ రికార్డ్స్ ఫైల్స్ తీసుకెళ్లడం అలాగే ఇంకోరి చేసి డిపిఓ సార్ కి. న్యాయం జరిగేట్ల చూస్తా అన్ని గ్రామస్తులకు హామీ ఇచ్చింది స్థానిక గ్రామ సర్పంచ్ మరియు గ్రామపంచయతీ కార్యదర్శి ఇద్దరు ఏకమై గ్రామ అభివృద్ధి పనులు చేస్తామని గ్రామ సభలు నిర్వహించకుండానే గ్రామ వార్డు సభ్యుల తీర్మానం లేకుండా గ్రామ నికి వచ్చే ప్రభుత్వం పనులు రోడ్లు బోర్ మోటార్స్ పనులు బోర్ మోటార్స్ పాడైపోయిన పట్టించుకోకుండా ఉండడం గ్రామ అభివృద్ధికి వచ్చే నిధులు వేరే వారి అకౌంట్ లోకి బదిలీ కావడం జరుగుతుంది స్థానిక ప్రజలు వార్డ్ సభ్యులు ఎన్నిసార్లు కాంప్లెక్స్ ఇచ్చిన నిమ్మకు నీరు ఎక్కినట్లుగా ఉంది గ్రామ సర్పంచ్ కు.వార్డు సభ్యులు అడిగితే నాకు నచ్చినట్లు.ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడుతూ నేను గ్రామానికి సర్పంచ్ నేను చెప్పిందే వేదం మీరేం చేసినా నాకు భయం లేదు అన్నట్టు తను మాట్లాడడం నా ఇష్టం వచ్చినట్లు చేస్తాను నాకు అడిగేటోళ్లు ఉండకూడదు అని గ్రామ వార్డు మెంబర్లకు ప్రజలకు పనులు చేస్తానని వ్యవహారం గ్రామానికి వచ్చే గ్రామ బడ్జెట్ వేరే వారి ఖాతాలకి వెళ్ళిపోతుందని స్థానిక వార్డ్ సభ్యులు స్థానిక గ్రామ ప్రజలు తీవ్ర అగ్రహము వ్యక్తం చేస్తున్నారు ఈ విషయంపై పై అధికారులకు విన్నవించగా డి ఎల్ పి ఓ అనిత గ్రామంని తనిఖీలు నిర్వహించడం జరిగింది.

# పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి...



మనప్రజాప్రతినిధి//ఖమ్మం జిల్లా:ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటిస్తూ నాణ్యమైన బోధన అందించాలి ఖమ్మం నగరం 8వ డివిజన్ వైఎస్ఆర్ కాలనీ లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఖమ్మం విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల శ్రేయస్సు, పరిశుభ్రమైన పాఠశాల వాతావరణం కల్పించడంలో ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.గురువారం ఖమ్మం కార్పోరేషన్ పరిధి 8వ డివిజన్ వైఎస్ఆర్ కాలనీ లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల హాజరు, మౌళిక సదుపాయాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు, పరిశుభ్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, ప్రతి విద్యార్థికి అన్ని సౌకర్యాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూలి, పాఠశాల వయస్సు గల ప్రతి ఒక్క విద్యార్థి కూడా విద్యకు దూరం కాకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని అన్నారు. పరిశుభ్రమైన వాతావరణం విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభ్యాసానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని కలెక్టర్ ప్రోత్సహించారు. విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల శ్రేయస్సు, పరిశుభ్రమైన పాఠశాల వాతావరణం కల్పించడంలో ఉపాధ్యాయులు, అధికారులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం పాఠశాలలోని మధ్యాహ్న భోజనం అన్నం, ఆకుకూరల పప్పు, సాంబారు, రాగిజావ ను పరిశీలించారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతతో పాటు పరిశుభ్రత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ఆహార పదార్థాల నిల్వ, వంట ప్రక్రియ, తాగునీటి సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, విద్యా శాఖ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# పాఠశాల భవనం కూలిపోవడం వల్ల తప్పిన ప్రమాదం

మనప్రజాప్రతినిధి//మెదక్ జిల్లా టేక్మాల్ మండలం ఏ క్లాస్ పూర్ గ్రామంలో మండల ప్రజా పరిషత్ పాఠశాల లో గత మూడు రోజుల నుండి కురుస్తున్న వర్షానికి పాఠశాల గోడ కూలడం జరిగింది. శిథిలావస్థలో ఉన్న పాఠశాలను గురించి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఇలాంటి శిథిలా వద్ద పాఠశాలను కూర్చి వేసి నూతన పాఠశాలను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇక్కడ విద్యార్థులు లేక పోవడం వల్ల ఎలాంటి ప్రమాదం జరగలేదని గ్రామస్తులు చెపుతున్నారు. ఇక్కడ చదువుకునే విద్యార్థుల సంఖ్య సుమారు 30 నుండి 50 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ జిల్లా యంత్రాంగం మరియు మంత్రివర్యులు చర్య తీసుకొని నూతన భవనాన్ని నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



# నకిలీ కార్డుల ఏరివేతే లక్ష్యం

మనప్రజాప్రతినిధి//జిల్లా చేగుంట జూలై 30అర్హులైన పేదలకు, మాత్రమే ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరాలని ఉద్దేశంతో, బోగస్ రేషన్ కార్డుల ఏరివేతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం, ఈ కేవైసీ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది, రేషన్ కార్డును, ఆధార్ కార్డుతో అనుసంధానించడం ద్వారా మరణించిన వారి పేర్లను తొలగించి అనర్హులను ఏరీ వేయడానికి ఈ ప్రక్రియ ఎంతో దోహదపడుతుంది, దీనికి అనుకూలంగా జులై 31,07,2026 నాటికి గడువు ముగేయనుంది,ఈ కేవైసి ప్రక్రియ చివరి తేదీ, 31 తో, ముగేయడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు, ఇప్పుడిప్పుడే వర్షాలు ప్రారంభం కావడంతో ప్రజలు వ్యవసాయ పనుల్లో నిగ్నమయారు, ఈ పక్రియను మరో 15 రోజులు పొడిగించి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని, రైతగం కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



# పెద్ది సుదర్శన్ రెడ్డి త్వరలోనే కోలుకుంటారు

- అధైర్యపడాల్సిన అవసరం లేదు..!
- ఎద్ది సుదర్శన్ రెడ్డి గారు త్వరలోనే కోలుకుంటారు.
- పార్టీ మొత్తం మీ కుటుంబానికి అండగా ఉంటుంది.
- త్వరలోనే ప్రజాక్షేత్రంలోకి తిరిగి రావాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



మనప్రజాప్రతినిధి//జనగామ: జనగామ నియోజకవర్గం.తెలంగాణ ఉద్యమకారుడు,బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు,నర్సంపే ట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి,గుండెపోటుకు గురై సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో గత మూడు రోజులుగా ఐసీయూలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజే శ్వర్ రెడ్డి,బుధవారం రాత్రి ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామ ర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా,పెద్ది సుదర్శన్ రెడ్డి,సతీమ ణితో పాటు వారి కుటుంబ సభ్యులను కలిసి వారికి మనోధైర్యం నింపారు. ఆయనకు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు. అధైర్యపడాల్సిన అవసరం లేదు. సుదర్శన్ రెడ్డి,ఈ క్లిష్ట పరిస్థితిని ధైర్యంగా అధిగమించి త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుం టారు. పార్టీ మొత్తం మీ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా కల్పిస్తూ వారిని ఓదార్చారు. అనంతరం తెలంగాణ ఉద్యమంలో విశేష పాత్ర పోషించిన పెద్ది సుదర్శన్ రెడ్డి,త్వరగా కోలుకుని మునుపటి లాగే ప్రజాక్షేత్రంలో చురుకుగా సేవలందించాలని భగవంతుడిని మన స్ఫూర్తిగా ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

# వి బి జీ రాం జీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సూర్యాపేట (మనప్రజాప్రతినిధి దినపత్రిక):వి బి జి రాం జీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని భారత్ ఖేత్ మజ్దూర్ యూనియన్ (దీ ఖ వీ ఖ) అనుబంధ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయం నుంచి విడుదల చేసిన పత్రికా ప్రకటనలో.... ఉద్యోగుల వేతన బకాయిలు విడుదల తో పాటు వారి దీర్ఘకాలిక డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని ముఖ్యంగా మూడు నెలల వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని పేస్కేలు అమలు చేయాలని క్యాడర్ ను ఖరారు చేయడంతో పాటు సీనియారిటీ ప్రాతిపదికన పదోన్నతులు కల్పించాలని అలాగే ఉమ్మడి జిల్లాల్లో పనిచేస్తున్న సిబ్బందికి బదిలీ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు వి బి జి రాం జీ ని రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని యధాతధంగా అమలు చేయాలని బి కే ఎం యు జాతీయస్థాయిలో ఉద్యమాన్ని ఉధృతంగా చేసినప్పటికీ కేంద్రంలో చలనం లేకపోవడం బాధాకరమని, సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని రోజుకు కనీస వేతనం 700 రూపాయలు అందించాలని ఉపాధి హామీ చట్టానికి ప్రతి బడ్జెట్లో నిధుల కోత విధిస్తున్నారని ఈ చర్యల వల్ల ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేస్తారనే అనుమానం ప్రజల్లో నెలకొని ఉన్నదని అలాంటి దుశ్చర్యలకు పాల్పడితే ఇటీవల కాక్రోచ్ జనతా పార్టీ ద్వారా కేంద్రానికి జరిగిన అవమానమే తిరిగి మరల పునరావృతం అవుతుందని హెచ్చరించారు. నరేంద్ర మోడీ షాద్వయం చేస్తున్న వికృత క్రీడలకు వికృత చేష్టలకు కాలం చెల్లిపోయింది అని వారు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు క్షేత్రస్థాయిలో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొని ఉన్నదని ప్రజలు ఉద్యమాల బాట పట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ముఖ్యంగా విద్యార్థులు,రైతులు, వ్యవసాయ కూలీలు, పారిశ్రామిక కార్మికులు,గిరిజనులు కేంద్ర ప్రభుత్వ పనితీరుపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని జాగ్రత్తగా వ్యవహరించకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ధనుంజయ నాయుడు హెచ్చరించారు




# ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



మనప్రజాప్రతినిధి//ఖమ్మం జిల్లా: నిర్ణీత షెడ్యూల్ ప్రకారం యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం పూర్తి చేయాలి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్జిల్లాలో అత్యాధునిక సదు పాయాలతో ఐదు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం రఘునాథపాలెం లోని స్కూల్ ఆఫ్ ఎక్స్ లెన్స్ బాలుర గురుకుల పాఠశాల నెలరోజుల లోపు అందుబాటులోకి రావాలి విద్యతో పాటు క్రీడలు, సాంకేతిక విద్యకు అనుగుణంగా అన్ని వసతుల కల్పన ఖమ్మం నియోజకవర్గ కేంద్రంలో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల, స్కూల్ ఆఫ్ ఎక్స్ లెన్స్ బాలుర గురుకుల పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఖమ్మం రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా సమీకృత గురుకులాల పనులను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. ఖమ్మం నియోజకవర్గం పరిధిలోని రఘునాథపాలెం వైఎస్ఆర్ నగర్ ప్రధాన దారిలో రూ. 200 కోట్ల వ్యయంతో కొనసాగుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను గురువారం జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. స్కూల్ నిర్మాణంలో హాస్టల్స్ భవనాలు, అకాడమిక్ బ్లాక్‌లు, డార్మిటరీ భవనం, వంటగది, భోజనశాల, ప్రధాన నివాస గృహం, క్వార్టర్స్ నిర్మాణ ప్రాంతాలను కాలినడకన పరిశీలిస్తూ భవనాల పనుల పురోగతి, నాణ్యత ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రతి పనిని సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూలి, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నియోజక వర్గానికి ఒకటి చొప్పున జిల్లాలో ఐదు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అందులో భాగంగానే ఖమ్మం నియోజక వర్గానికి సంబంధించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి అగ్రిమెంట్ ప్రకారం స్కూల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. భవిష్యత్ తరాలకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా సమీకృత గురుకులాలను ఏర్పాటు చేస్తోందన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంకేతిక నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసంలోనూ రాణించేలా అత్యాధునిక మౌళిక వసతులతో ఈ విద్యాసంస్థలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల ఆవరణలో విద్యార్థుల రాకపోకలకు అనువుగా లింక్ రోడ్లు, అంతర్గత రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, పచ్చదనం వంటి మౌలిక వసతులను సమగ్రంగా అభివృద్ధి చేయాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రణాళికాబద్ధంగా అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. నిర్మాణ సంస్థలు, ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతిరోజూ పనుల పురోగతిని పర్యవేక్షిస్తూ, నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రఘునాథపాలెం మండల కేంద్రంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న స్కూల్ ఆఫ్ ఎక్స్ లెన్స్ (బాలుర) గురుకుల పాఠశాల/కళాశాల భవనం నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పరిశీలించారు. నెలరోజుల లోపు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట రఘునాథపాలెం తహసీల్దార్ శ్వేత, ఇంజినీరింగ్ అధికారులు, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత కోచింగ్ ను బీసీ యువత సద్వినియోగం చేసుకోవాలి..




మనప్రజాప్రతినిధి// ఖమ్మం జిల్లా:ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అర్హులైన ప్రతి బీసీ అభ్యర్థి గడువులోగా లాంగ్ టర్మ్ కోచింగ్ కు దరఖాస్తు చేసుకోవాలి యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్2027 ఉచిత లాగ్ టర్మ్ కోచింగ్‌కు సంబంధించిన వాల్ పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ఖమ్మంప్రభుత్వం ప్రతిభావంతులైన బీసీ యువతకు కల్పిస్తున్న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్2027 ఉచిత కోచింగ్ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకుని, అత్యున్నత సివిల్ సర్వీసుల లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో టీజీ బీసీ స్టడీ సర్కిల్, ఖమ్మం ఆధ్వర్యంలో నిర్వహించనున్న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్2027 దీర్ఘకాలిక ఉచిత కోచింగ్ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లు, కరపత్రాలను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి, సమాజ అభివృద్ధికి పరిపాలనలో ప్రతిభావంతులైన యువత భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పూర్తి ఉచితంగా యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ కోచింగ్‌ను అందిస్తూ, బీసీ విద్యార్థులకు అండగా నిలుస్తోందన్నారు. గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన యువత కూడా ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి అత్యున్నత సర్వీసులను లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగేందుకు ఈ కోచింగ్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు 2026, ఆగస్టు 24 నుంచి 2027, మే నెల వరకు పూర్తిగా ఉచిత కోచింగ్ అందించనున్నట్లు తెలిపారు. నాణ్యమైన బోధనతో పాటు, కోచింగ్ సామగ్రి, గ్రంథాలయ సదుపాయం, కరెంట్ అఫైర్స్ మెటీరియల్, అనుభవజ్ఞులైన అధ్యాపకుల శిక్షణ, రెగ్యులర్ పరీక్షలు, మాక్ టెస్టులు, వ్యక్తిత్వ వికాస శిక్షణ, ఇంటర్వ్యూ మార్గదర్శకత్వం వంటి అన్ని సౌకర్యాలు ప్రభుత్వం పూర్తిగా ఉచితంగా కల్పిస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం కోచింగ్ కార్యక్రమానికి మొత్తం 150 మంది అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వీరిలో 100 మందిని ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష ద్వారా, మరో 50 మందిని ఇప్పటికే యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల నుంచి ఎంపిక చేయనున్నట్లు వివరించారు. ఎంపికైన అభ్యర్థులకు స్టైపెండ్, అదనంగా ఒకేసారి పుస్తకాల గ్రాంట్ అందజేస్తామని అన్నారు. ఈ ఆర్థిక ప్రోత్సాహకాలు విద్యార్థులు పూర్తిస్థాయిలో పోటీ పరీక్షలపై దృష్టి కేంద్రీకరించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని అర్హులైన విద్యార్థులకు కూడా ఈ సమాచారాన్ని చేరవేసేందుకు అధికారులు ప్రత్యేక ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రతిభకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకి కాకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలను అమలు చేస్తోందని, యువత పట్టుదలతో శ్రమిస్తే అత్యున్నత లక్ష్యాలను తప్పకుండా చేరుకోగలరని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదైనా విభాగంలో డిగ్రీ పూర్తి చేసి ఉండాలని, బీసీ,ఎస్సి, ఎస్టీ వర్గానికి చెందినవారై ఉండాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ 2026 ఆగస్టు 7 వరకు కొనసాగుతుందని, ఆగస్టు 16న ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష, ఆగస్టు 19న ఫలితాలు, ఆగస్టు 21 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్, ఆగస్టు 24 నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. అర్హతలు, ఎంపిక విధానం, దరఖాస్తు ప్రక్రియ తదితర పూర్తి వివరాలను టీజీ బీసీ స్టడీ సర్కిల్ అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించి గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధికారిణి జి. జ్యోతి, డైరెక్టర్ బీసీ స్టడీ సర్కిల్ గోన శ్రీలత, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిణి మాధవి, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకట్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారులు, టీజీ బీసీ స్టడీ సర్కిల్ ప్రతినిధులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో ఉన్న ఇండ్ల లబ్ధిదారులను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలి




మనప్రజాప్రతినిధి//జిల్లా చేగుంట, జులై 30,:చేగుంట మండలం రెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని స్థానిక సర్పంచ్ నర్సింహా,పంచాయతీ కార్యదర్శితో కలిసి ఎంపీవో ప్రకాష్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వర్షాల నేపథ్యంలో గ్రామ పరిధిలో శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉన్న ఇళ్లను తక్షణమే గుర్తించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా, శిథిల గృహాల్లో నివాసముంటున్న వారిని గుర్తించి గ్రామ పంచాయతీలోని,ప్రభుత్వ భవనాల్లో సురక్షిత ఆశ్రయం కల్పించాలని సూచించారు. వర్షాల వేళ ప్రజల ప్రాణరక్షణే ధ్యేయంగా గ్రామ స్థాయిలో అధికారులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ, అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి




మనప్రజాప్రతినిధి//అక్బర్ పేట భూంపల్లి :అక్బర్ పేట్ భూంపల్లి మండల పోలీస్ స్టేషన్ పరిధిలో ఎడతెరిపి లేని వర్షాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం అయితే తప్ప బయటకు రావద్దని అక్బర్ పేట్ భూంపల్లి మండల ఎస్ ఐ రాజశేఖర్ మండలంలోనిఉన్న గ్రామాల ప్రజలకు సూచించారు. భారీ వర్షాలు కురుస్తుందున వల్ల ప్రవహిస్తున్న వాగులు, వంకలు, చెరువుల, కాలువలు వద్దకు ఎవరు వెళ్లవద్దన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెరువులు, వాగులు, ప్రాజెక్టుల వద్దకు ప్రజలు, యువత వెళ్లకూడదన్నారు. వర్షం నీటి వల్ల రోడ్డుపై వాహనాలు స్పీడ్ గావెల్లితే ప్రమాదం ఉన్నందున, పరిమిత వేగంతో వాహనాలు నడపాలని సూచించారు. పిల్లలు, యువకులు వాగుల చెరువుల, కాలువల దగ్గరకు సెల్ఫీలు తీసుకోవడానికి, ఈత కొట్టడానికి వెళ్లకుండా తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. అలాగే విద్యుత్ పరికరాలకు పోల్స్ కు మరియు బోర్ మోటర్ స్టార్టర్ డబ్బాల దగ్గర దూరంగా ఉండాలి.విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు సేవలంచడానికి పోలీసు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని, ఎటువంటి సహాయం కావాలన్నా డయల్ 100/112 కి లేదా స్థానిక గ్రామ పోలీస్ అధికారులకి ఫోన్ చేయాలీ అని చెప్పారు.

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇక్కిరి రాముకు ఎమ్మెల్యే పల్లా



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం.జనగామ పట్టణంలోని ఇరవై రెండవ వార్డుకు చెందిన ఇక్కిరి రాము రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, వారి నివాసానికి వెళ్లి రాము మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా రాము కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

## మాతృమూర్తికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ నివాళి



సదాశివపేట మండల్ //(మనప్రజా ప్రతినిధి) :సదాశివపేట మండలంలోని వెల్టూరు గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డమీద సత్యనారాయణ మాతృమూర్తి శ్రీమతి పార్వతమ్మ పరమపదించిన విషయం తెలుసుకున్న సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ వారి స్వగృహానికి వెళ్లి పార్వతమ్మ అమృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం గడ్డమీద సత్యనారాయణ గారితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారికి మనోధైర్యాన్ని కల్పించారు. పార్వతమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ప్రసాదించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు, గ్రామ సర్పంచ్ కిష్టయ్య, మాజీ సర్పంచ్ లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకులు చిక్కుల మల్లేశం, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీనివాస్, గొల్ల నవీన్ తదితరులు ఉన్నారు.

## ఉద్యోగుల బకాయిల విడుదల

హైదరాబాద్, జూలై 30 (మనప్రజాప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీని తెలంగాణ ప్రభుత్వం అమలు చేసింది. ఉద్యోగ సంఘాల నాయకులకు ఇచ్చిన మాట మేరకు 100 రోజుల్లో రూ.6 వేల కోట్ల బకాయిలను విడుదల చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం, మూడు విడతల్లో ఆ మొత్తాన్ని పూర్తిగా చెల్లించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా గురువారం మరో రూ.2 వేల కోట్ల నిధులను విడుదల చేశారు. దీంతో ఉద్యోగులకు చెల్లించాల్సిన రూ.6 వేల కోట్ల బకాయిల చెల్లింపు ప్రక్రియ పూర్తయింది. ప్రభుత్వం బకాయిలను మూడు విడతల్లో విడుదల చేసింది. మే 29న తొలి విడతగా రూ.2 వేల కోట్లు, జూన్ 30న రెండో విడతగా మరో రూ.2 వేల కోట్లు విడుదల చేయగా, గురువారం మూడో విడతగా మరో రూ.2 వేల కోట్లను విడుదల చేసింది. తీవ్ర ఆర్థిక పరిస్థితులు ఉన్నప్పటికీ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఈ నిర్ణయం ద్వారా మరోసారి స్పష్టమైందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం కల్పించింది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కమ్యూటేషన్ బకాయిలను ఈ నిధులతో పూర్తిస్థాయిలో చెల్లించినట్లు ఆర్థిక శాఖ వెల్లడించింది. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు ఎదురుచూస్తున్న ప్రధాన సమస్యల్లో ఒకటైన ఈ



అంశానికి పరిష్కారం లభించడంతో లబ్ధిదారుల్లో సంతృప్తి వ్యక్తమవుతోంది. మిగిలి ఉన్న ఇతర బకాయిలను కూడా దశలవారీగా విడుదల చేసి పూర్తిగా చెల్లిస్తామని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను సమతుల్యం చేసుకుంటూనే ఉద్యోగుల హక్కులను పరిరక్షించే దిశగా ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తోందని పేర్కొంది. ఉద్యోగుల సంక్షేమం విషయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపింది.బకాయిల విడుదలతో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు హర్షం

## ఫీజుల బకాయి..బిజెపి లడాయి పోస్టర్ ఆవిష్కరణ



మనప్రజాప్రతినిధి// దినపత్రిక, చేర్యాల,జనగామ: జనగామ నియోజకవర్గం. చేర్యాల పట్టణంలో బీజేవైఎం,ఆధ్వర్యంలో ఫీజుల బకాయి బిజెపి లడాయి పోస్టర్ ఆవిష్కరణ చేసి విద్యార్థులతో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా బీజేవైఎం నాయకులు సోగాల మనోజ్ కుమార్ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్,& స్కాలర్‌షిప్ సుమారు పదిహేను వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని,రాష్ట్రంలో వేలాది మంది పేద,మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడానికి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పథకాలు ఎంతో కీలకమైనవని, అయితే ప్రస్తుతం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కింద సుమారు పదిహేను వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉండటం వల్ల రాష్ట్రంలోని సుమారు నలబై లక్షల మంది పేద విద్యార్థుల భవిష్యత్తు అయోమయంలో పడిందని అన్నారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తివేసే కుట్ర జరుగుతోందని,ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను సకాలంలో విడుదల చేయకపోవడం వల్ల ఈ పథకం భవిష్యత్తుపై విద్యార్థుల్లో ఆందోళన నెలకొందని,పేద విద్యార్థుల ఉన్నత విద్యకు ఆధారంగా నిలిచిన ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే పరిస్థితి ఏర్పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.నిధుల విడుదలలో జాప్యం కొనసాగితే పథకం భవిష్యత్తుపై ప్రశ్నలు తలెత్తే అవకాశం ఉందని అన్నారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ విద్యార్థులకు బిక్ష కాదు హక్కురాజ్యాంగం కల్పించిన విద్య హక్కును అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పథకాలు అమలులోకి వచ్చాయి.ఇవి ప్రభుత్వ దయాదాక్షిణ్యాలు కాదు,నిరుపేద విద్యార్థుల విద్యాభ్యాసాన్ని కొనసాగించే హక్కుకు సంబంధించిన సంక్షేమ పథకాలు,కాబట్టి వీటి అమలులో ఆలస్యం చేయడం విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుంది అన్నారు.ప్రభుత్వం విడుదల చేయాల్సిన బకాయిలు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో అనేక ప్రైవేట్ కళాశాలలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని,అధ్యాపకుల జీతాలు,విద్యా నిర్వహణ,మౌలిక వసతుల నిర్వహణలో సమస్యలు తలెత్తుతున్నాయని,వడ్డీకి తెచ్చిన పైసల మిత్తి కట్టలేని పరిస్థితిలలో కళాశాల యాజమాన్యాలు ఉన్నాయని అన్నారు.బకాయిల విడుదల కోసం న్యాయస్థానాలను ఆశ్రయించే పరిస్థితి ఏర్పడటం ఆందోళన కలిగించే అంశం అని అన్నారు.పెండింగ్ రియంబర్స్మెంట్ కారణంగా కొన్ని చోట్ల విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడంలో జాప్యం జరుగుతోందని విద్యార్థులు వాపోతున్నారని,ఉన్నత విద్య,ఉద్యోగాలు లేదా ఇతర కోర్సుల్లో అడ్మిషన్ల కోసం అవసరమైన సర్టిఫికెట్లు సమయానికి అందక నలబై లక్షల మంది పేద విద్యార్థుల్లో అనేక మంది అయోమయంలో పడుతున్నారని,స్కాలర్‌షిప్ విడుదలలో ప్రభుత్వం మొండిచేయిస్కాలర్‌షిప్ నిధుల విడుదల ఆలస్యం కావడంతో ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు హాస్టల్,పుస్తకాలు,ప్రయాణ ఖర్చులు,ఇతర విద్యా అవసరాలను తీర్చుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,సమయానికి అందాల్సిన సహాయం ఆలస్యమవడం వారి చదువుపై ప్రత్యక్ష ప్రభావం చూపుతోంది అన్నారు.విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం వద్దువిద్యార్థుల సమస్యలను రాజకీయ కోణంలో కాకుండా విద్యా,సంక్షేమ దృక్పథంతో చూడాల్సిన అవసరం ఉందని,రాష్ట్రంలోని నలబై లక్షల మంది పేద విద్యార్థుల భవిష్యత్తు ఈ పథకాల అమలుపైనే ఆధారపడి ఉందని,ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బకాయిలను విడుదల చేసి విద్యార్థులు,కళాశాలల ఆందోళనకు ముగింపు పలకాలి అన్నారు.లేని యెడల రాబోయే రోజులలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు వడ్లకొండ సంజీవులు, బీజేవైఎం నాయకులు,కేథోజి సాయి కుమార్,మనిశ్,అనిల్, వినయ్,ఎల్లం,శివ కుమార్,ప్రవీణ్,తదితరులు పాల్గొన్నారు.

## వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
### ఇల్లంతకుంట ఎస్సై సిరిసిల్ల అశోక్

మన ప్రజాప్రతినిధి/ మనకొండూరు తేదీ 30 జూలై :ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో ఎడతెరిపి లేని వర్షాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం అయితే తప్ప బయటకు రావద్దని ఇల్లంతకుంట ఎస్సై సిరిసిల్ల అశోక్ సూచించారు. భారీ వర్షాలు కురుస్తుందున వల్ల ప్రవహిస్తున్న వాగులు, వంకలు, చెరువులు, కాలువలు వద్దకు ఎవరు వెళ్లవద్దన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెరువులు, వాగులు, ప్రాజెక్టుల వద్దకు ప్రజలు, యువత వెళ్లకూడదన్నారు. వర్షం నీటి వల్ల రోడ్డుపై వాహనాలు స్కిడ్ అయ్యే ప్రమాదం ఉన్నందున, పరిమిత వేగంతో వాహనాలు నడపాలని సూచించారు. పిల్లలు, యువకులు చెరువులు, కాలువల దగ్గరకు సెల్ఫీలు తీసుకోవడానికి, ఈత కొట్టడానికి వెళ్లకుండా తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. అలాగే విద్యుత్ పరికరాలను మరియు పోల్స్ కు దూరంగా ఉండాలి.విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు సేవలంచడానికి పోలీసు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని, ఎటువంటి సహాయం కావాలన్నా డయల్ 100/112 కి లేదా స్థానిక గ్రామ పోలీస్ అధికారులకి ఫోన్ చేయాలీ.




## బీజేపీ కార్మిక విభాగం కన్వీనర్ గా కరణం గణేష్ రవికుమార్ నియామకం



మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట జూలై 30,:భారతీయ జనతా పార్టీ సిద్దిపేట జిల్లా కార్మిక విభాగం కన్వీనర్ గా మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రానికి చెందిన కర్ణం గణేష్ రవికుమార్ ను నియమించినట్టు బీజేపీ రాష్ట్ర కార్మిక విభాగం కన్వీనర్ అందే శ్రీనివాస్ తెలిపారు.గురువారం బీజేపీ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో అందె శ్రీనివాస్ చేతుల మీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా గణేష్ రవి కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ ఇచ్చిన ప్రతి కార్యక్రమం విజయవంతం చేసి జిల్లాలో కార్మిక సమస్యలపై పోరాడి కార్మికులకు న్యాయం చేస్తానని,కార్మిక విభాగంను ప్రతి మండల కేంద్రాలలో పటిష్టం చేసి ప్రతి కార్మికునికి న్యాయం జరిగేలా చూస్తానని ఆయన తెలిపారుఈ నియామకానికి సహకరించిన ఎంపీ మాధవనేని రఘునందన్ రావు , జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్, మండల పార్టీ అధ్యక్షుడు ఎల్లారెడ్డి, మాజీ అధ్యక్షులు చింతల భూపాల్, ప్రధాన కార్యదర్శి సంతోష్ రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు ర్యాపాకుల చంద్రశేఖర్ గౌడ్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## అంగన్వాడీ టీచర్లు, ఆయాల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి



మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట జూలై 30: మెదక్ ప్రాజెక్టు పరిధిలోని నాలుగు మండలాల అంగన్వాడీ టీచర్లు, ఆయాల పోస్టులకు సంబంధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ రెండు రోజుల పాటువిజయవంతం గా నిర్వహించినట్లు సీడీపీఓ తెలిపారు. టీచర్ల 4 ఖాళీలకు 57 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వెరిఫికేషన్ ప్రక్రియ అనంతరం మెరిట్ ఆధారంగా ఎంపికలు చేపడతామని ఆమె తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన విద్యాశాఖ, రెవెన్యూ శాఖ అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## వీధి కుక్కల సంచారం భయంలో గ్రామీణ, పట్టణ ప్రజలు
## చిన్నపిల్లలు, మహిళలకు తప్పని తిప్పలు



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట జూలై 30,:చేగుంట మండలం లో పలు గ్రామాలలో ప్రజల పై గ్రామ సింహాల దాడిపై ప్రజా ప్రతినిధి స్పెషల్ స్టోరీ, (గ్రామ సింహాలు)మా మనుగడకు ఇబ్బందుల్లేవని తెలుసుకుని, చుట్టుపక్కల ఉన్న వాళ్లమంతా ఒక దగ్గరికి చేరుతాం .రోజూ వారిగా సమావేశాలు ఏర్పాటు చేసుకొని .ఏ గ్రామం లొ,ఏ కాలనీలో, ఏ వీధిలో ఏ టైమ్ కి సంచారానికి ఇబ్బందులుండవో చర్చించుకుని అక్కడికి గుంపులుగా విడిపోయి గమ్య స్థానాలకు చేరతాం. కనిపించిన వారిపై దాడిచేస్తాం. మా దెబ్బలకు, చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు బెంబేలెత్తిపోయేలా రెచ్చిపోతుంటాం. పంచాయతి అధికారుల, సఫాయికార్మికులు అండదండలు ఉన్నంత కాలం మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు.ఎందుకంటే మేము.. గ్రామ సిహాలం.' ఈ విధంగా పట్టణంలో, గ్రామాలలో వీధి కుక్కల స్వైర విహారం ఉన్నా.. వాటిని పట్టించుకున్న పాపన పోలేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.పట్టణ, గ్రామాలలో వీటి నియంత్రణకు అధికారులు, సర్పంచ్ లు చొరవ చూపకపోతుండటంపై ప్రజల నుండి తీవ్ర విమర్శలు వస్తున్నాయి.చేగుంట మండలం లొ సింహాలు లేని గ్రామం లేదు చేగుంట మండలం లొ పట్టణం లొ,పలు గ్రామాలలో పలానా కాలనీలో వీధి కుక్కల సమస్య లేదు అని చెప్పలేనంతగాపరిస్థితి చేగుంట మండలం ఉంది గ్రామాలలో,కొన్ని విధి,ప్రాంతాల్లో గ్రామ సింహాలు, గుంపులు గుంపులుగా తిరుగుతూద్విచక్రవాహనా దారులను, విద్యార్థులను, వయోవృద్ధులను, వెంబడిస్తూ, వారు భయకంపితులై వాహనాలను వేగంగా నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా చేగుంట గాంధీ చౌరస్తా, ఎన్జీవోస్ కాలనీ, చందాయిపేట్ ప్రభుత్వ పాఠశాల, మక్కారాజ్ పేట్ ప్రభుత్వ పాఠశాలప్రాంతాల్లో శునకాల సమస్య అధికంగా ఉంది. రాత్రి10గంటల తరువాత బస్సు దిగి ఇళ్లకు వెళ్లే వారినివెంబడిస్తూ నానా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ప్రజల వాపోతున్నారు. స్కూల్ విద్యార్థులు పొద్దున పాఠశాల లకు వెళ్లాలన్న భయంతో వెళ్తున్నారు, ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామ సింహాల నుండి రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

## గోదావరిపై వరద అప్రమత్తం

**-మొదటి ప్రమాద హెచ్చరికకు ముందస్తు సన్నద్ధత**
**-అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశం**
**-పునరావాస కేంద్రాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాట్లు**
**-ప్రజల ప్రాణ రక్షణకు సమన్వయ చర్యలు**



భద్రాద్రి కొత్తగూడెం, జూలై 30 (మనప్రజాప్రతినిధి): ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో గోదావరి నదిలో నీటిమట్టం క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశం ఉన్నందున అన్ని ప్రభుత్వ శాఖలు పూర్తి సన్నద్ధంగా ఉండి ముందస్తు చర్యలను ముమ్మరం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. గోదావరి వరద పరిస్థితులపై నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించాలని కలెక్టర్ సూచించారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, వైద్య సేవలు, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య సౌకర్యాలు ఎలాంటి లోటు లేకుండా సిద్ధంగా ఉంచాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశారు.మత్స్యశాఖ, పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక, వైద్య, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖలు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. గజ ఈతగాళ్లు, బోట్లు, లైఫ్ జాకెట్లు, అవసరమైన పరికరాలు, అత్యవసర సిబ్బందిని అందుబాటులో ఉంచి ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనే విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. గోదావరి స్నాన ఘాట్లు, నది తీరాలు, పర్యాటక ప్రాంతాల్లో బ్యారికేడ్లు ఏర్పాటు చేసి ప్రజలు నదిలోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గోదావరి ప్రవాహం సాధారణ స్థితికి చేరుకునే వరకు చేపల వేట, పడవల రాకపోకలను నియంత్రించాలని సూచించారు. ప్రమాదకర ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.గురువారం సాయంత్రం 6 గంటల నాటికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 28.40 అడుగులకు చేరుకోగా, ప్రవాహం 3,88,452 క్యూసెక్కులుగా నమోదైంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ అంకిత్ అన్ని శాఖల అధికారులకు స్పష్టం చేశారు. ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి వరద ప్రభావాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు వేగంగా సహాయ సహకారాలు అందేలా జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని సూచించారు.

## వందేమాతరం బిల్లుపై ఒవైసీ విమర్శలు



న్యూఢిల్లీ, జూలై 30 (మనప్రజాప్రతినిధి): పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పొందిన వందేమాతరం బిల్లుపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ లోక్‌సభ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్లమెంట్ సమావేశాలు ముగిసిన అనంతరం విలేకరులతో మాట్లాడిన ఆయన, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టం దేశ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని ఆరోపించారు. బిల్లుపై తమ పార్టీ అభ్యంతరాలను స్పష్టంగా వెల్లడించారు. జాతీయ గీతం 'జనగణమన', జాతీయ గేయంగా పరిగణిస్తున్న 'వందేమాతరం' మధ్య ఉన్న తేడాను కూడా ఒవైసీ ప్రస్తావించారు. 'జనగణమన' దేశ వైవిధ్యం, ఐక్యతను ప్రతిబింబిస్తుందని, అయితే 'వందేమాతరం' ఒక నిర్దిష్ట పూజా విధానం, దేవతారాధనకు సంబంధించిన భావాలను కలిగి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కారణంగా రెండింటినీ ఒకే కోణంలో చూడలేమని పేర్కొన్నారు.1950 నాటి పరిణామాలను ప్రస్తావించిన ఒవైసీ, అప్పటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ పార్లమెంటులో ప్రత్యేక తీర్మానం లేకుండానే వందేమాతరానికి జాతీయ గేయ హోదా ప్రకటించారని అన్నారు. భారత రాజ్యాంగంలో గానీ, ప్రస్తుత చట్టాల్లో గానీ 'జాతీయ గేయం' అనే పదానికి స్పష్టమైన నిర్వచనం లేదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుత సవరణ చట్టం రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను ప్రభావితం చేస్తోందని ఒవైసీ ఆరోపించారు. ముఖ్యంగా ఆర్టికల్ 25, 26, 29 కింద పౌరులకు లభించే మత స్వేచ్ఛ, సాంస్కృతిక హక్కులపై ఈ చట్టం ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆయన అన్నారు. ఈ అంశాలను ప్రభుత్వం పునఃపరిశీలించాలని కోరారు.పార్లమెంట్‌లో ఈ బిల్లుపై అధికార, ప్రతిపక్షాల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం జాతీయ గేయానికి చట్టబద్ధ రక్షణ కల్పించడమే ఈ బిల్లు ఉద్దేశమని స్పష్టం చేస్తుండగా, కొన్ని ప్రతిపక్ష పార్టీలు రాజ్యాంగ, మత స్వేచ్ఛల పరిరక్షణ కోణంలో అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగత, పార్టీ అభిప్రాయాలే. వందేమాతరం బిల్లుకు ఇప్పటికే పార్లమెంట్ ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. ఈ అంశంపై రాజకీయ పార్టీల మధ్య భిన్నాభిప్రాయాలు కొనసాగుతున్న నేపథ్యంలో చట్టంపై చర్చ మరింత ముదురుతోంది.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి





మనప్రజాప్రతినిధి//మిర్యాలగూడ టౌన్ జులై 30 :మిర్యాలగూడ మండలం శ్రీనివాస్ నగర్‌లోని ఎంజేపీటీ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గర్ల్స్ స్కూల్ ఉదయం మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మండల విద్యాశాఖ అధికారి ఎం ఈ ఓ తో కలిసందర్శించారు సందర్భంగా పాఠశాల ఆవరణ తరగతి గదులు మౌలిక వసతులు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలుపరిసరాల పరిశుభ్రతను ఎమ్మెల్యే క్షుణ్ణంగా పరిశీలించారు అనంతరం ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి టీచర్స్ రిజిస్టర్‌ను పరిశీలించారుపాఠశాలలో అవసరమైన మౌలికవసతులు విద్యా బోధన,సిబ్బంది సమస్యలు, ఇతర అవసరాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు తదుపరి విద్యార్థులతో ముఖాముఖి సమావేశమై వారి విద్యాభ్యాసంహాస్టల్ వసతులుఆహారం తాగునీరు పరిశుభ్రత ఇతర సమస్యల గురించి అడిగి తెలుసుకుని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారుఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారుడా బి ఆర్ అంబేద్కర్ గారి ఆశయాల సాధనలో భాగంగా చదువు ఒక్కటే మన స్థితి గతులను, మన కుటుంబ స్థితిగతులు మారుస్తుంది మన జీవన శైలిని మారుస్తుందికాబట్టి ప్రతిఒక్క విద్యార్థి మంచిగా చదువుకొని తమ భవిష్యత్తు తో పాటు మన దేశ భవిష్యత్ కు ఉపయోగకరంగా మారాలి అని అన్నారప్రభుత్వ పాఠశాలలు గురుకులాల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ చేపడుతోందని అన్నారు విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారుఅలాగే ఆగస్టు 15వ తేదీ వరకు ప్రతిరోజూ మిర్యాలగూడ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు గురుకులాలను సందర్శిచిఅక్కడపరిస్థితులను స్వయంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటానని వెల్లడించారు అనంతరం పాఠశాలలో నిర్వహించిన ఉదయం అసెంబ్లీలో విద్యార్థులతో కలిసి పాల్గొని వారికి విద్య యొక్క ప్రాముఖ్యత క్రమశిక్షణ, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న యూనిఫామ్‌లను విద్యార్థులకు పంపిణీ చేసి ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలు నాణ్యమైన భోజనం అందించడం కోసం కాస్మోటిక్ చార్జీలు పెంచడం విద్యా సంవత్సరం మొదటి నెల లోనే విద్యార్థులకు యూనిఫామ్, బుక్స్ అందజేయడం అనేక సంక్షేమాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలనిఅధిరోహించాలని ఆకాంక్షించారుఈ కార్యక్రమంలో పాఠశల ప్రధానోపాధ్యాయులుఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

## గణేష్ ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

**-విగ్రహ తయారీదారులతో సీపీ సమీక్ష**
**-16 అడుగుల ఎత్తుకే విగ్రహాల పరిమితి**
**-భద్రత, రవాణాపై కీలక ఆదేశాలు**
**-మట్టి విగ్రహాల వినియోగానికి**






హైదరాబాద్, జూలై 30 (మనప్రజాప్రతినిధి): రాబోయే గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా, పర్యావరణహితంగా నిర్వహించేందుకు హైదరాబాద్ నగర పోలీసు శాఖ ముందస్తు సన్నాహాలను ముమ్మరం చేసింది. ఇప్పటికే భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులతో సమావేశమైన పోలీసు అధికారులు, గురువారం బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో విగ్రహ తయారీదారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనర్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించి పలు కీలక సూచనలు చేశారు. విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి శోభాయాత్ర, నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని సీపీ స్పష్టం చేశారు. గత ఏడాది నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో సుమారు 23 వేల గణేష్ విగ్రహాలు ప్రతిష్ఠించగా, రవాణా సమయంలో నాలుగు ప్రమాదాలు జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. ఈసారి అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తయారీ దశ నుంచే భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితితో జరిగిన చర్చల మేరకు గణేష్ విగ్రహాల గరిష్ఠ ఎత్తును 16 అడుగులకు పరిమితం చేయాలని సీపీ పేర్కొన్నారు. కళాకారులు మట్టి విగ్రహాల తయారీకి ప్రాధాన్యం ఇవ్వాలని, భక్తులు కూడా సులభంగా నిమజ్జనం చేయగల చిన్న విగ్రహాలను ఎంచుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. విగ్రహాల తయారీ కేంద్రాల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా అగ్నిమాపక భద్రతా చర్యలు తీసుకోవడంతో పాటు విద్యుత్ వ్యవస్థను సురక్షితంగా నిర్వహించాలని సూచించారు. విగ్రహాల తయారీదారులకు అవసరమైన మౌలిక వసతులను వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో అందించేందుకు నగర పోలీసు శాఖ సహకరిస్తుందని సజ్జనర్ హామీ ఇచ్చారు. ధూల్‌పేట్, జల్‌పల్లి, మైలార్‌దేవ్‌పల్లి వంటి ప్రధాన ప్రాంతాల నుంచి విగ్రహాల రవాణా కోసం ప్రత్యేక ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రద్దీ సమయాల్లో భారీ విగ్రహాల రవాణాను పూర్తిగా నివారించాలని, ముందస్తుగా ట్రాఫిక్ పోలీసుల అనుమతి తీసుకోవాలని సూచించారు.విగ్రహాల కొనుగోలు, రవాణా, మండపాలకు చేరుకునే సమయం, మార్గాల వివరాలను స్థానిక శాంతిభద్రతలు, ట్రాఫిక్ పోలీసులకు తప్పనిసరిగా తెలియజేయాలని సీపీ స్పష్టం చేశారు. భారీ విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ తీగలు, ఫ్లైఓవర్లు, మెట్రో నిర్మాణాలకు ఆటంకం కలగకుండా ముందస్తు రవాణా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. లోడింగ్, అన్‌లోడింగ్‌కు ఉపయోగించే క్రేన్లు, వాహనాలు ధ్రువీకరణ పొందినవే కావాలని, అనుభవజ్ఞులైన సిబ్బందితోనే నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు పోలీసు కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్, సంయుక్త పోలీసు కమిషనర్ జోయల్ డేవిస్, ట్రాఫిక్ డీసీపీలు కాజల్ సింగ్, రాహుల్ హెగ్డే, గోల్కొండ జోన్ డీసీపీ జె. రాఘవేందర్ రెడ్డి, శంషాబాద్ జోన్ డీసీపీ బి. రాజేష్‌తో పాటు పలువురు అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర పోలీసు అధికారులు, విగ్రహ తయారీదారులు పాల్గొన్నారు. ఉత్సవాలు ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని సీపీ పిలుపునిచ్చారు.

## శిథిలావస్థలో ఉన్న ఇండ్ల లబ్ధిదారులను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట, జులై 30,:చేగుంట మండలం రెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని స్థానిక సర్పంచ్ నర్సింహా,పంచాయతీ కార్యదర్శితో కలిసి ఎంపీవో ప్రకాష్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వర్షాల నేపథ్యంలో గ్రామ పరిధిలో శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉన్న ఇళ్లను తక్షణమే గుర్తించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా, శిథిల గృహాల్లో నివాసముంటున్న వారిని గుర్తించి గ్రామ పంచాయతీలోని,ప్రభుత్వ భవనాల్లో సురక్షిత ఆశ్రయం కల్పించాలని సూచించారు. వర్షాల వేళ ప్రజల ప్రాణరక్షణే ధ్యేయంగా గ్రామ స్థాయిలో అధికారులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ, అప్రమత్తంగా ఉండాలని అన్నారు.